క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బౌరంపేట్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ బాలాజీ ఫీడర్ పరిధిలోని శంభీపూర్, మహేశ్వరం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

- ప్రగతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగింపు నేపథ్యంలో ఎలిప్ ఫీడర్ పరిధిలో విష్ణుప్రియనగర్, ఎన్ఆర్ఐ కాలనీ, అక్షర స్కూల్ ఏరియా, విస్టా విల్లాస్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...
- మిథిలానగర్ ఫీడర్ పరిధిలోని మిథిలానగర్ సర్కిల్ ఏరియా, భాష్యం బ్లూమ్స్‌సూ క్ల్, ఆర్‌కే లేఅవుట్, వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

కమిటీహాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



కృషి కాలనీలో కమిటీహాల్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కాలనీలు, బస్తీల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడు ఉంటుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం సూరారం డివిజన్ కృషి కాలనీలో రూ.20 లక్షలతో చేపట్టనున్న కమిటీహాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి పనులకు ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న కేకేఎం ట్రస్ట్‌చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్

చింతల్: నిరుపేద విద్యార్థులను ఆదుకునేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటామని కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, గడియారం, గొడుగులతో కూడిన కిట్లను విద్యార్థులకు అందజేశారు. పత్తి సతీష్, సదానందం, బిల్లా, జితేందర్‌రెడ్డి, సాయిరాంరెడ్డి, పాల కుమార్, మల్లం శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, తోకల శ్రీను, ఆదిత్య, రామ్‌సాయి యాదవ్, మధు, సీతారామయ్య, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నేత, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ జన్మదిన వేడుకలు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరై కృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, పార్టీ నేతలు, అభిమానులు వేల సంఖ్యల్లో తరలి వచ్చారు. కృష్ణతో కేక్ కట్ చేయించి శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష ఇళ్లు నిర్మించి 70వేల డబుల్ ఇళ్లు ఇచ్చాం

- ఈసారి మళ్లీ గెలిపిస్తే మరో లక్ష ఇళ్లు కట్టిస్తాం
- దుండిగల్‌లో నాల్గో విడత డబుల్ ఇళ్ల పంపిణీ
- తెలంగాణ హోంమంత్రి మహమూద్ అలీ





లబ్ధిదారుడైన దివ్యాంగుడికి పట్టాను అందజేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్. సభకు హాజరైన లబ్ధిదారులు

దుండిగల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్ మినహా మిగిలిన జిల్లాలు వెనుకబడి ఉండేవని... ప్రత్యే రాష్ట్రం ఆవిర్భావం అనంతరం తెలంగాణ వేగంగా అభివృద్ధి సాధిస్తు దేశానికే ఆదర్శంగా మారిందని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్‌లో నిర్వహించిన నాల్గో విడత డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం ఘనమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా నీరు, రైతులకు ఉచిత విద్యుత్, ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతు బీమా, దళిత బంధు వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు.

అప్పట్లో కాంగ్రెస్ నేతలు హేళనగా మాట్లాడారు..

- గతంలో అసెంబ్లీలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంపై వ్యాఖ్యలు చేస్తే తమ సహచర మంత్రి తలసాని కాంగ్రెస్ నేతలను స్వయంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాల వద్దకు తీసుకెళ్లారని గుర్తు చేశారు. మీరు కట్టలేరు.. ఇవ్వలేరు.. అంటూ అప్పట్లో కాంగ్రెస్ నేతలు హేళనగా మాట్లాడారని తెలిపారు. ఇప్పుడు గ్రేటర్ పరిధిలో లక్ష ఇళ్లు నిర్మించి అందులో 70వేల ఇళ్లను లబ్ధిదారులకు అందజేశామన్నారు. మరో 30 వేలను త్వరలోనే అందిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఆశీర్వదించి మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపిస్తే మరో లక్ష ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు.

ఉద్యమ సమయంలో కాంగ్రెస్ నేతలు మభ్య పెట్టాలని చూశారు: ఎమ్మెల్సీ

అనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి కాంగ్రెస్ పెద్దలు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే అభివృద్ధి కుంటు పడుతుందని భయపెట్టారన్నారు. భూముల రేట్లు పడిపోతాయని, నక్సలిజం పెరుగుతుందని, ప్రజలు వలసల బాట పడతారని ఇలా ఎన్నో రకాలుగా మభ్యపెట్టాలని చూశారన్నారు. కానీ ఇప్పుడు అందరి చూపు తెలంగాణ వైపే ఉందన్నారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ బంగారు తెలంగాణే లక్ష్యంగా పయనిస్తున్నారని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాల కోసం భూములు ఇచ్చిన దుండిగల్ గ్రామ రైతులకు ఈ సందర్భంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక: ఎమ్మెల్యే

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ... ఎంతో పారదర్శకంగా ర్యాండమైజేషన్ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 70 వేల పట్టాలను పంపిణీ చేశామని తెలిపారు. నిరుపేదలు ఆత్మగౌరవంతో బతికే విధంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించామన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఎంతో కష్టపడి ఈ పథకాన్ని విజయవంతం చేసిందన్నారు. దుండిగల్, డి.పోచంపల్లి, బహదూర్‌పల్లిలో నిర్మించిన 2,850 ఇళ్లను కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల లబ్ధిదారులకు అందజేశారు.

- ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, కూకట్‌పల్లి జెడ్‌సీ మమత, మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్‌ప్రకాశ్, తహసీల్దార్ సుచరిత, కమిషనర్ సత్యనారాయణ, నిజాంపేట మేయర్ కొలన్ నీలారెడ్డి, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, కుట్టుమెషిన్ శిక్షణా కేంద్రం ప్రారంభం



కార్నివలి ఫౌండేషన్ చైర్మన్ జాకీని సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది, స్థానికులు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని శివనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కార్నివలి ఫౌండేషన్ అంతర్జాతీయ సంస్థ అభివృద్ధి చేసింది. ఈ పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ సెంటర్, పేదలకు కుట్టుమెషిన్ శిక్షణా కేంద్రం నిర్మాణం పూర్తయ్యింది. దీంతో గురువారం ఫౌండేషన్ చైర్మన్ జాకీ, ఇంటర్‌నేషనల్ రోటరీ క్లబ్ అధ్యక్షులు జోసఫ్‌తో కలిసి దీనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రాధిక, చంద్రశేకర్, హిమబిందు, రోటరీ క్లబ్ సభ్యులు, పాఠశాల ఫౌండర్ రత్నేశ్వర రావు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు అనురాధ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

8న ఓయూలో ట్రైబల్ డిక్లరేషన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ట్రైబల్ డిక్లరేషన్ వాల్ పోస్టర్‌ను ఆర్ట్స్ కాలేజీ ఎదుట గురువారం ఆవిష్కరించారు. అనంతరం గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ మాట్లాడుతూ... ఈ నెల 8న ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో జరిగే కార్యక్రమానికి రాష్ట్రంలోని 33 జిల్లాల గిరిజనులు హాజరుకావాలని కోరారు.

ఐటీ రంగానికి పునాదులు వేసిన ఘనత రాజీవ్‌గాంధీదే..



గాంధీనగర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

రంగారెడ్డినగర్: నేడు భారతదేశం అగ్రగామిగా ఉందంటే అదంతా దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చలవేనని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌లో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం విగ్రహ దాత హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసి రాజీవ్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. ఆయన కృషి ఫలితమే నేడు లక్షలాది మంది ఐటీ నిపుణులుగా దేశాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నారని కొనియాడారు. రాజీవ్ హయాంలో దేశం అన్నిరంగాల్లో పురోగాభివృద్ధి సాధించిందన్నారు. ఆయన సేవలను దేశ ప్రజలు ఎన్నడూ మరువరన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జల్దా రాఘువులు, మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ ఖాజామియా, కాంగ్రెస్ నాయకులు అవిజె జేమ్స్, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్ ముదిరాజ్, సిద్దనోళ్ల సంజీవరెడ్డి, మేకల ఎల్లయ్య, వీరేష్ గుప్తా, తైలం శ్రీనివాస్, షేక్ మొహమ్మద్‌పాషా, బుయ్యని శివకుమార్, బిక్షపతి, గణేష్, శ్రీనివాస్‌చారి, నాగరాజు, శ్యామ్, మహిళా నాయకులు రాధమ్మ, కౌసల్య, కుమారి తదితరులు ఉన్నారు.

పరుపుల కంపెనీలో భారీ అగ్నిప్రమాదం



అగ్నిప్రమాద దృశ్యం

జీడిమెట్ల: జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డులోని నేచర్ స్లీప్ పరుపుల కంపెనీలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల, ఫైర్ అధికారుల వివరాల ప్రకారం.. జీడిమెట్ల ఫేజ్-1లో నేచర్ స్లీప్ మ్యాట్రెసెస్ పరిశ్రమ ఉంది. గురువారం రాత్రి 8గంటలకు పరిశ్రమకు తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయాయి. రాత్రి 8.30గంటల ప్రాంతంలో పరిశ్రమ లోపల పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు వెంటనే జీడిమెట్ల ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న ఫైర్ సిబ్బంది స్థానికులు సహాయంతో పరిశ్రమ షెట్టర్స్ పగలగొట్టి రెండు ఫైర్ ఇంజన్‌లతో మంటలను ఆర్పివేశారు. అప్పటికే పరిశ్రమ లోపల ఉన్న సామాగ్రి దాదాపుగా కాలిపోయింది.

కార్మికులు లేకపోవడంతో తప్పిన ప్రాణాప్రాయం..

పరిశ్రమను మూసి కార్మికులు ఇళ్లకు వెళ్లిన తర్వాత అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అస్తి నష్టం మాత్రం పెద్ద ఎత్తున జరిగినట్లు తెలుస్తుంది. అగ్నిప్రమాదానికి కారణం పరిశ్రమ లోపల ఏదైనా షార్ట్‌సర్క్యూట్ జరిగి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని జీడిమెట్ల పోలీసులు పరిశీలించారు.

జీఓ.142ను రద్దు చేసి న్యాయం చేయాలి



ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజును కలిసిన మేడ్చల్ జిల్లా వైద్య అధికారులు

కుత్బుల్లాపూర్: మేడ్చల్ జిల్లా వైద్య అధికారుల బృందం జీఓ.142ను రద్దుచేసి తమకు న్యాయం చేయాలని గురువారం ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజుకు వినతి పత్రం అందజేసింది. మేడ్చల్ డిప్యూటీ డీఎంహెచ్ఓ ఆనంద్, శామీర్‌పేట్ సివిల్ సర్జన్ శ్రీకాంత్, కుత్బుల్లాపూర్ మండల వైద్యాధికారి నిర్మల, డాక్టర్లు నవనీత, పద్మ, మమత, కోటారెడ్డి, మధు తదితరులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన శంభీపూర్‌రాజు వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదే విధంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేయగా సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఓవరాల్ చాంపియన్‌గా కుత్బుల్లాపూర్ సర్కారు బడి జట్టు



గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఓవరాల్ చాంపియన్‌షిప్ జట్టు సభ్యులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ శంషాబాద్‌లో జరిగింది. ఈ పోటీల్లో కుత్బుల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల బాలుర జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో బాలూర అండర్- 17 చెస్ విజేతగా మియాసాబ్, అదే విధంగా అండర్ -17 'ఖోఖో'లో మొదటి స్థానం, అండర్-14 'ఖోఖో'లో ద్వితీయ స్థానాల్లో నిలిచారు. చాంపియన్‌షిప్ ట్రోఫీ రీజనల్ కో.ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనితకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా విజేతలను నిలిచిన విద్యార్థులు వారికి తర్ఫీదు ఇచ్చి ప్రోత్సహించిన పీఈటీ నవీన్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

వీధి కుక్కలను కట్టడి చేయడంలో విఫలం

- కల్లూరి రాజుపై వీధి కుక్కల దాడి
- కుక్కల నుంచి రక్షించడంలో యంత్రాంగం విఫలం



కల్లూరి రాజు తొడపై తీవ్రగాయమైన దృశ్యం

కుత్బుల్లాపూర్: వీధి కుక్కల బారి నుంచి ప్రజలను రక్షించడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. కొంపల్లి మున్సిపల్ బీజేపీ నాయకుడు శివాజీరాజు ఆరోపించారు. బుధవారం సాయంత్రం ఉమామహేశ్వర కాలనీకి చెందిన కల్లూరి రాజు(35) నూజివీడు సీడ్స్ కంపెనీ వద్ద రోడ్డు మీద నిలబడి మాట్లాడుతుండగా ఒక్కసారిగా వీధి కుక్క అతడిపై దాడి చేసి గాయపరిచింది. తీవ్రంగా గాయపడ్డ అతడిని స్థానికులు మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. కాగా అక్కడి వైద్యులు నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రికి సిఫార్సు చేయడంతో బాధితుడు అక్కడికి వెళ్లి చికిత్స చేయించుకుంటున్నాడు.

- గురువారం బాధితుడిని పరామర్శించిన శివాజీరాజు మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా వీధి కుక్కల బారిన పడి పదుల సంఖ్యలో జనం గాయపడుతున్న అధికారులకు చీమ కుట్టినట్లెనా లేదన్నారు. బ్లూక్రాస్‌తో ఒప్పందం చేసుకున్నామంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప ఒక్క వీధి కుక్కకు కూ.ని. ఆపరేషన్‌లు చేసిన దాఖలాలు లేవని మండిపడ్డారు. ఇక ప్రజాప్రతినిధులు ఈ విషయంలో పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వీధి కుక్కల దాడిలో గాయపడిన వారికి రూ.10 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

తెలుగు విశ్వవిద్యాలయంలో అడ్మిషన్లు షురూ..

నిజాంపేట్: బాచుపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో లైబ్రరీ సైన్స్, యోగా కోర్సులలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 2023-24 విద్యా సంవత్సరానికి బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, పీజీ డిప్లమా ఇన్ యోగా కోర్సుల్లో చేరేందుకు అభ్యర్థులకు అవకాశం కల్పిస్తున్నారు. ఒక సంవత్సరం పాటు కొనసాగే బీఎల్ఐఎస్‌సి, యోగా కోర్సుల్లో చేరడానికి ఉత్సుకత చూపే అభ్యర్థులు శాఖాధిపతిని (9866493720) ఫోన్‌లో సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఈనెల 10వ తేదీ వరకు గడువు ఉందని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

ప్రొఫెషనల్ డే



వివిధ శాఖల అధికారుల వేషధారణలో నార్త్ సిటీ హైస్కూల్ విద్యార్థులు

సుభాష్‌నగర్: విద్యార్థి దశ నుండే గోల్ పెట్టుకొని చదివితే తమ లక్ష్యాన్ని సాధిస్తారని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేష్‌ముదిరాజ్ అన్నారు. సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్‌లో గురువారం ప్రొఫెషనల్ డేను ఘనంగా నిర్వహించారు. సమాజంలో వివిధ రంగాలలో సేవ చేస్తున్న వ్యక్తులుగా విద్యార్థులు కూడా నిష్ణాతులై సమాజ శ్రేయస్సుకు తమ వంతు కృషిగా తయారు కావాలన్నారు. విద్యార్థులతో వివిధ శాఖల అధికారుల వేషధారణ వేయించి వారిలో ఉత్తేజాన్ని నింపారు. ప్రిన్సిపాల్ వెంకటేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఉత్సాహం రెట్టింపై వారు చదువుల్లో రాణిస్తూ వారి అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకుంటారని తెలిపారు.

కాంట్రాక్టర్ల నిర్ణయం.. పనులపై ప్రభావం

- జంట సర్కిళ్ల పరిధిలో నిలిచిన పనులు
- ఆందోళనలో కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు
- పెండింగ్ బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ల డిమాండ్



సర్కిల్ కార్యాలయం వద్ద నల్ల బాడ్జిలతో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్లు

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో ఇంజినీరింగ్ పనులన్నీ నిలిచిపోవడంతో స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేపో.. మాపో..!! ఎన్నికల షెడ్యూల్ రానున్న నేపథ్యంలో ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే వివేకానంద కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు పూర్తి చేశారు. ఇలా మొత్తం ఎనిమిది డివిజన్లలో ఒక్కో డివిజన్‌లో రూ.3 - 5 కోట్ల వరకు పనులకు శ్రీకారం చుట్టారు.

కాంట్రాక్టర్ల నిర్ణయం.. ప్రభుత్వంపై ప్రభావం

- తాజాగా కాంట్రాక్టర్లు ముకుమ్మడిగా 'నో పేమెంట్.. నో వర్క్' నినాదంతో పనులను నిలిపేయడం ఇప్పుడు చర్చగా మారింది.. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటిస్తూ నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్న నేపథ్యంలో కాంట్రాక్టర్లు తీసుకున్న నిర్ణయం ఎన్నికలపై ప్రభావం చూపుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.. సుమారు రూ.41 కోట్ల విలువ చేసే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయగా, ఆ పనులను కాంట్రాక్టర్లు చేపట్టాల్సి ఉంది. స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు తమ కాలనీకి రోడ్లు, డ్రైనేజీ, మురికి కాలువలు వేస్తున్నారని సంతోషపడ్డ వారికి ఆదిలోనే హంసపాదు... అన్నట్లుగా కాంట్రాక్టర్లు ఒక్కసారిగా పనులు చేయమని మొండి చేయడంతో అయోమయంలో పడ్డారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన...

గ్రేటర్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని ఈ నెల 3వ తేదీన కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఆందోళన మొదలు పెట్టిన కాంట్రాక్టర్లు తాజాగా గురువారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. గత ఆరు నెలలుగా బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి కాంట్రాక్టర్లకు బకాయి పడ్డ డబ్బులు చెల్లించాలని కాంట్రాక్టు అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్ ,కోశాధికారి అశోక్ డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లించే వరకు ఎట్టి పరిస్థితుల్లో తాము పనులు చేయమని, కొత్తగా టెండర్లకు దూరంగా ఉంటామని స్పష్టం చేశారు. అప్పులు కట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికే ఎంతో నష్టపోయామని, ఈ విషయాన్ని గుర్తించి ప్రభుత్వం మాకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించాలని కోరారు.

ఎక్కడికక్కడ నిలిచిన పనులు

కాంట్రాక్టర్ల నిరసనలతో ఎక్కడికక్కడ అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. జీడిమెట్ల డివిజన్ పరిధి వైష్ణవి ఎన్‌క్లేవ్‌కు రోడ్డు పనులకు ఇటీవల రూ.64లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు నిరసన తెలపడంతో పనులు నిలిచిపోయాయి.



వైష్ణవి ఎన్‌క్లేవ్ రోడ్డులో పనులు నిలిచిపోయిన దృశ్యం

తెలంగాణ ఆడబిడ్డలకు 'బతుకమ్మ కానుక'

జంట సర్కిళ్ల పరిధిలో బతుకమ్మ చీరల పంపిణీ గురువారం సైతం కొనసాగింది. ఆయా డివిజన్ల పరిధిలోని వార్డు కార్యాలయాల వద్ద కార్పొరేటర్లు మహిళలకు ప్రభుత్వం తరపున చీరలు పంపిణీ చేసి బతుకమ్మ వేడుకలను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని అభిలాషించారు.

– కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్‌లో మహిళలకు చీరలు ఇస్తున్న మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్



సుభాష్‌నగర్‌లో చీరలు అందజేసిన కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి



రంగారెడ్డినగర్‌లో చీరలు అందజేస్తున్న కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్